క్లుప్తంగా

బాలల సంరక్షణపై అవగాహన

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): బాలల సంరక్షణ, వారి హక్కులపై నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఆ సంస్థ ఏరియా జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలలను రక్షించడం మనందరి కనీస బాధ్యతగా గుర్తించాలన్నారు. బాలల హక్కులు వారు అనుభవించేలా చూడాలని సూచించారు. ప్రతి విషయంలో వారిని కొట్టడం, తిట్టడం చేస్తే మానసికంగా కుంగిపోతారని తెలిపారు. లైంగిక వేధింపులకు పాల్పడకుండా, బాల్య వివాహాలు జరగకుండా సామాజిక బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

శ్మశానవాటికలో ముళ్లపొదలు తొలగింపు



ఇబ్రహీంపట్నం: ఎస్సీ శ్మశానవాటికలో ముళ్ల పొదలు, తుమ్మచెట్ల తొలగింపు పనులను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం చేపట్టారు. శ్మశానవాటిక ఆక్రమణలతో కుచించుకుపోయినట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దృష్టికి స్థానిక నాయకులు తీసుకువెళ్లారు. ఆక్రమణల తొలగింపునకు సర్వే నిర్వహించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వసంత తన సొంత ఖర్చుతో ముళ్లపొదల తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. తొలగింపు పనులు పూర్తయిన అనంతరం సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగిస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు లంక మోహన రావు, వార్డు కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మి, ఎస్.ప్రకాష్, దయాకర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైలవరం: మైలవరం సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ రమేష్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేస్తామని ఏఈ రమేష్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు



కేతనకొండ(ఇబ్రహీంపట్నం):సేంద్రియ వ్యవసాయంతో రైతులకు అధిక ప్రయోజనాలు చేకూరతాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ అధిపతి విజయకుమారి అన్నారు. కేతనకొండ గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలు, రసాయన ఎరువులతో కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరి పంటలకు వాడే బ్రహ్మాస్త్రం తయారీ చేసి చూపించారు. బ్రహ్మాస్త్రంతో వరిలో ఆశించే ఆకుచుట్టు పురుగు, కాండం తొలుచుపురుగు, పత్తిలో గులాబీ, పచ్చపురుగు నివారించవచ్చన్నారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. మండల ఏవో శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారుల దాడులు

నూజివీడు: పట్టణంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా గృహాలు, వాణిజ్య సముదాయాలపై ఆకస్మిక దాడులు జరిపి రూ.2.24 లక్షల జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు, ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో 37 బృందాలు కలిసి 1953 గృహ సర్వీసులు, 503 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 80 సర్వీసులకు అదనపులోడు కింద రూ.1.84 లక్షలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీలు, ఏఈలు, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారం వినియోగించుకోండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గిరిజన బాలబాలికలు ప్రభుత్వం అందిస్తున్న సహకారం సద్వినియోగం చేసుకుని ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ డీజీ (స్పెషల్ పోలీస్) సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని కొండపల్లిలో ఆంధ్రప్రదేశ్ సంక్షేమ గిరిజన గురుకుల బాలికల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆదివాసీ దినోత్సవ విశిష్టత తెలియజేశారు. క్రమశిక్షణతో కూడిన మంచి చదువులతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వర్లు, బాలాజీ నాయక్, బి.శ్రీనివాసరావు, రవి, గణేష్, నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



జూపూడిలో అమరవీరుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సర్పంచి కాకి దేవమాత, కార్యదర్శి మునేశ్వరరావు



చంద్రాలలో నా భూమి నా దేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ లక్ష్మీకుమారి, సర్పంచ్ జ్యోతి



మొర్సపూడిలో పంచ ప్రాణప్రతిజ్ఞలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



నూజివీడు గుర్రంగేటు వద్ద పంచ ప్రాణప్రతిజ్ఞ చేస్తున్న వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ

జూపూడి(ఇబ్రహీంపట్నం): దేశ రక్షణ కోసం అమర వీరులు చేసిన త్యాగాలు మరువలేనివని జూపూడి గ్రామ సర్పంచి కాకి దేవమాత అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా నా భూమి నా దేశం కార్యక్రమంలో సచివాలయం వద్ద అమరవీరుల స్ఫూర్తితో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని శుక్రవారం ప్రారంభించారు. నిమ్రా కళాశాల విద్యార్థులతో 65వ నంబర్ జాతీయ రహదారిపై మువ్వన్నెల జెండాతో ర్యాలీ జరిపారు. పంచాయతీ కార్యదర్శి జి.మునేశ్వరరావు, ఏపీవో మాధవరెడ్డి, బాలాజీ, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాచవరంలో గ్రామ సర్పంచి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నా భూమి నా దేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శిలాఫలకం ఆవిష్కరించి మొక్కలు నాటారు. ఎంపీటీసీ సభ్యుడు ఎం.రంగస్వామి, కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

జి.కొండూరు: భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహనీయుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎంపీడీఓ అనూరాధ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మండల పరిధిలోని చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, గంగినేనిపాలెం, తెల్లదేవరపాడు, దుగ్గిరాలపాడు, చిన్ననందిగామ, గుర్రాజుపాలెం గ్రామాల్లో నా భూమి నా దేశం కార్యక్రమాన్ని అధికారులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాల ఆవిష్కరణ, వీరులకు వందనం, పంచప్రాణ ప్రతిజ్ఞ, వసుధకు వందనం కార్యక్రమాలను నిర్వహించారు.

దేశ ప్రగతి కోసం విద్యార్థులు కృషి చేయాలి

చంద్రాల(మైలవరం): దేశ ప్రగతి, శ్రేయస్సు కోసం విద్యార్థులు కృషి చేయాలని ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలోని పేరంటాలమ్మ చెరువు వద్ద ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి అధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జె. గంగాధరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వరదా శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం ఏపీఓ, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొర్సపూడిలో సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో...

నూజివీడు: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులను, యుద్ధ వీరులను స్మరించుకోవడం భారతీయులందరికీ గర్వకారణమని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మండలంలోని మొర్సపూడిలో శుక్రవారం నిర్వహించిన నా భూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సబ్‌కలెక్టర్ శిలాఫలకం వద్ద పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచి శెట్టిపల్లి హరిరామకృష్ణప్రసాద్, ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూజివీడులో ...

ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా పట్టణంలోని గుర్రంగేటు వద్ద శుక్రవారం నా భూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకునే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం శిలాఫలకం వద్ద పంచ ప్రాణ ప్రతిజ్ఞ నిర్వహించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో శిలాఫలకాల ఆవిష్కరణ

గంపలగూడెం: ''నా భూమి–నాదేశం'' కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులు, అమర వీరుల స్మారక శిలాఫలకాలను శుక్రవారం గంపలగూడెం మండలంలోని ఐదు గ్రామాల్లో ఆవిష్కరించారు. పెనుగొలను, చింతలనర్వ, ఊటుకూరు, రాజవరం, లింగాల గ్రామాల్లో పలు నినాదాలతో ఉన్న అమరవీరుల శిలాఫలకాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, సర్పంచ్ సంగెపు లలిత, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.శ్రీనివాసరెడ్డి, రాజవరంలో సర్పంచ్ చెన్నుపాటి నరసింహరావు జ్యోతి వెలిగించి శిలాఫలకాన్ని జాతికి అంకితమిచ్చారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్ ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

తిరువూరురూరల్: మండలంలోని నాలుగు గ్రామాల్లో శుక్రవారం ఆజాదీ కీ అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు నిర్వహించారు. ముష్టికుంట్ల, వామకుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి, ఎరుకోపాడు గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. గ్రామంలోని పలు వీధుల్లో మొక్కలు నాటారు.

మొక్కలు నాటిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

రెడ్డిగూడెం: ఆజాది కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రెడ్డిగూడెంలో నా భూమి నా దేశం, నేలతల్లికి వందనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండలంలోని అన్నేరావుపేట, నాగులూరు, పాతనాగులూరు, రెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. చెరువుల వద్ద, పాఠశాలల వద్ద, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాలను, ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాది రాణి, మండల సచివాలయ కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఎంపీడీఓ బీవై విష్ణు ప్రసాద్, ఏపీఓ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో...

ఎ.కొండూరు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాభూమి నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలను నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను, యుద్ధవీరులను స్మరించుకుంటూ నాభూమి నాదేశం శిలాఫలకాన్ని వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయిబాబు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకోవాలి

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరులను స్మరించుకుని దేశభక్తి చాటుకోవాలని ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో జరిగిన నాభూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమంలో ఎంపీపీ ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి ఉయ్యూరు గోపాలరావు, ఎంపీడీఓ వీఎల్‌వీ శేషగిరిరావు, కార్యదర్శి పి.మురళీకృష్ణ, స్థానికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. జక్కంపూడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ తో పాటు స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు బయ్యారపు కల్పన, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కిషోర్, నాయకులు గంధం శ్రీనివాసరావు, ఎల్.వెంకటకృష్ణ, గ్రామ కార్యదర్శి పి.భారతి, సచివాలయ సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు. అంతకు ముందు పైడూరుపాడు, రాయనపాడు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, గ్రామ సర్పంచ్‌లు కాటంనేని కళ్యాణి, వేమూరి సీతారామయ్య, పైడూరుపాడు సొసైటీ చైర్మన్ కాటంనేని పూర్ణచంద్రరావు, గ్రామ కార్యదర్శి స్వరూపరాణి, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.

నేల తల్లిని కాపాడుకుందాం

ముసునూరు: నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం వేడుకలు ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో శుక్రవారం గోపవరం హైస్కూల్లో నిర్వహించారు. వీరుల శిలాఫలకం వద్ద పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మయ్య, ఎంపీటీసీలు కాలీషా మస్తాన్ వలి, వెంకమ్మ, తహసీల్దార్ దాసరి సుధ, హెచ్‌ఎం నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



గంపలగూడెం మండలం పెనుగొలనులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి



కొమ్మిరెడ్డిపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు



రెడ్డిగూడెంలో మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



కె.తాడేపల్లి గ్రామంలో నా భూమి–నాదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ



మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివి

ఎంపీపీ మెర్సీవనజాక్షి



విస్సన్నపేట హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి, అధికారులు

విస్సన్నపేట: స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి త్యాగాలు మరువలేనివని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, కొండపర్వ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో, వేమిరెడ్డిపల్లి, పుట్రేల సచివాలయ పరిధిలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి - నాదేశం నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను, యుద్ధవీరులను స్మరించుకుంటూ శిలాఫలకాలు ఏర్పాటు చేశారు.శిలాఫలకాల వద్ద ఘనమైన నివాళులు అర్పించటంతో, మొక్కలు నాటటం, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఏపీఓ అనురాధ, ఎంఈఓ -2 సుధాకర్, సర్పంచ్ సాధుపాటి నాగ మల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, ఈఓ శ్రీనివాసరావు, హెచ్‌ఎం ప్రసాద్, కొండపర్వ సర్పంచ్ జి.రమేష్‌బాబు, వైస్‌ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత పాల్గొన్నారు.

సమృద్ధిగా తాగునీటి సరఫరాకు చర్యలు

ఎమ్మెల్యే రక్షణనిధి




తిరువూరు ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: తిరువూరు పట్టణ ప్రజలకు ప్రతిరోజూ రక్షిత మంచినీరు అందించడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. తిరువూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో కట్టలేరు పంపింగ్ స్కీం నుంచి పలు వార్డులకు కొత్తగా నిర్మిస్తున్న పైపులైన్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. 50 సంవత్సరాల క్రితం అప్పటి జనాభా అవసరాలకు నిర్మించిన పైపులైన్లు పగిలిపోయి, మంచినీరు లీకేజీ అవుతుండటంతో వారంలో 2, 3 రోజులకు మించి తాగునీరందట్లేదని, కొత్త పైపులైన్లు నిర్మించి ఈ సమస్య పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, పరసా సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

కిడ్నీ రోగులకు సత్వర సేవలు

తిరువూరు ప్రభుత్వాసుపత్రిలో కిడ్నీ రోగులకు సత్వర సేవలందించాలని ఎమ్మెల్యే రక్షణనిధి వైద్యులకు సూచించారు. ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ బాధితులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఆధునిక వైద్యపరికరాలు సైతం సమకూర్చామన్నారు. ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి గార్గేయ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ళ మోహనరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చలమాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞాన వృద్ధి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఎంవీ బసవేశ్వరరావు

నూజివీడు: వర్క్‌షాప్‌లను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానాన్ని మరింత పెంపొందించవచ్చని పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సెస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. స్థానిక పీజీ కాలేజీలో శుక్రవారం సాంఖ్యకశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల భవితకు బాటలు వేసేందుకు వర్క్‌షాప్‌లు దోహదపడతాయన్నారు. ఈ వర్క్‌షాప్‌ను స్టాటిస్‌ఫర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ నిర్వహించింది. హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇన్ స్టాటికల్ టూల్స్ అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. వర్క్‌షాప్‌లో కృష్ణా యూనివర్సిటీ అనుబంధ కళాశాలలైన ఆంధ్రా లయోలా కాలేజీ, కేబీఎన్ కాలేజీ, శ్రీ కృష్ణవేణి డిగ్రీ కాలేజీ, శ్రీ శ్రీనివాసా డిగ్రీ కాలేజీ, పీబీ సిద్ధార్థ కాలేజీ నుంచి మొత్తం 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. కోఆర్డినేటర్ సీవీ శాస్త్రి, అధ్యాపకులు కె.అవినాష్, డి.తేజశ్వేత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి జోగి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఇబ్రహీంపట్నం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి, సంక్షేమ బోర్డు పనిచేసేలా చూడాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు పనితీరులో జాప్యం జరగడం వలన కార్మికులకు అందాల్సిన వివిధ రకాల సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా బోధన చేయాలి

చాట్రాయి: విద్యార్థులకు సరైన సమయంలో సరైన బోధన అందించాలని టీఎఆర్‌ఎల్ జోనల్ కో ఆర్డినేటర్ ఎం.జాన్ విల్సన్ సూచించారు. మండలంలోని పోలవరం ఎంపీపీఎస్ కేపీ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి మూడు గ్రూపులుగా విభజించి పాఠ్యాంశాలను బోధించాలని ఆయన చెప్పారు. ఉపాధ్యాయుల బోధనను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడి పనిచేయండి

గంపలగూడెం: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆరు గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడి పనిచేయాలని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వామిత్వ సర్వేపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని కనుమూరు, అనుముల్లంక, వినగడప, గంపలగూడెం, చెన్నవరం, రాజవరం గ్రామాల్లో స్వామిత్వ సర్వే పరిస్థితిని, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, మండల సర్వేయర్ సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ సచివాలయ సర్వేయర్లు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

బీమా నగదు పంపిణీ

ముసునూరు: మండలంలోని చెక్కపల్లికి చెందిన వస్తం వెంకన్న(33) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను మృతుని భార్య అంజమ్మకు శుక్రవారం హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ సీహెచ్ రాటాలు అందజేశారు.

పాలవెల్లువపై సమీక్ష

తిరువూరురూరల్: జగనన్న పాలవెల్లువ పథకంపై తిరువూరు మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు మల్లేల సచివాలయంలో శుక్రవారం సమీక్ష జరిపారు. పాలవెల్లువ ద్వారా పాల సేకరణ పెంచాలని, రైతుల్ని పాలు పోసే విధంగా ప్రోత్సహించాలని ఆదేశించారు.

క్రీడాదుస్తుల వితరణ

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు పట్టణానికి చెందిన గోకుల్ జ్యుయలర్స్ అధినేత రాచబంటి వెంకటాద్రి, హరికృష్ణ రూ.15 వేల విలువ చేసే క్రీడా దుస్తులు వితరణగా ఇచ్చారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం పీవీఎస్ రాజుకు వాటిని అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

సత్యాలపాడు(గంపలగూడెం): వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అవగాహన పెంచుకుని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సత్యాలపాడు జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఎంఆర్ శేషంరాజు తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై రూపొందించిన కరపత్రాలను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు.

మల్లేలలో ఫ్యామిలీ డాక్టర్

మల్లేల(తిరువూరురూరల్): మల్లేల గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం కింద చౌటపల్లి పీహెచ్‌సీ వైద్యులు కల్యాణ్‌చక్రవర్తి, ప్రత్యూష గ్రామంలో దీర్ఘకాలిక రోగులు, దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామస్తులకు సూచనలిచ్చారు.

సీసీ ప్రయోగాలపై శిక్షణ

గంపలగూడెం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి క్రాప్ కటింగ్(సీసీ) ప్రయోగాలపై గంపలగూడెం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ రమేష్ మాట్లాడుతూ క్రాప్ కటింగ్ ప్రయోగాల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

ద్రావిడ భాషా శాస్త్రవేత్త భద్రిరాజుకు ఘన నివాళి

గంపలగూడెం: పెనుగొలనులో శుక్రవారం షిరిడి సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ద్రావిడ భాషా శాస్త్ర పరిశోధకులు భద్రిరాజు కృష్ణమూర్తి వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఎం.క్రిస్టఫర్, సాయిబాబా సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీరు అందిస్తాం

తునికిపాడు(గంపలగూడెం): గ్రామస్తులకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా చేసేందుకు ఆర్వో ప్లాంట్లను గ్రామాల్లో రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు. గంపలగూడెం మండలం తునికిపాడులో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటులో భాగంగా బోరు తవ్వకం పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు.

ఈ- క్రాప్‌లో నమోదు

ఆగిరిపల్లి(నూజివీడు): రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు అన్నారు. మండలంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు.

లారీ ఢీకొని యాచకుడి మృతి

జూపూడి(ఇబ్రహీంపట్నం): మండలంలోని జూపూడి వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యాచకుడు (60) మృతి చెందాడు. హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వెళ్తున్న లారీ రోడ్డు పక్కన నడుస్తూ వెళ్తున్న యాచకుడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వీఆర్వో శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సీఐ పి.శ్రీను తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు...

జి.కొండూరు: గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన కవులూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలలోకి వెళ్తే...గ్రామంలో 70 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు గత రెండు రోజులుగా భిక్షాటన చేస్తూ సంచరిస్తున్నాడు. శుక్రవారం గ్రామంలోని కల్యాణమండపం సమీపంలో స్పృహ కోల్పోయి పడి ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ ధర్మరాజు వచ్చి పరిశీలించి ఆ వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తాలూకా వ్యక్తులు ఎవరైనా ఉంటే 94407 96448 నంబరులో సంప్రదించాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com